## 317 వ అధ్యాయం

## ٣١٧ - بَابُ الْعَفْوِ عَنْ لَغْوِ الْيَمِينِ وَأَنَّهُ لاَ كَفَّارَةَ فِيهِ، وَهُوَ مَا يَجْرِي عَلَى اللِّسَانِ بِغَيْرِ قَصْدِ الْيَمِينِ كَقَوْلِهِ عَلَى الْعَادَةِ: لاَ وَاللهِ! وَبَلَى وَاللهِ! وَنَحْوِ ذٰلِكَ

## ప్రమాణం చేసే ఉద్దేశ్యం లేకుండా అలవాటు ప్రకారం నోటి నుండి 'దైవసాక్షి!' లాంటి పదాలు వెలువడటం 'పొరపాటు ప్రమాణం' క్రిందికి వస్తుంది. ఇది క్షమార్హమైనది. దీనికి పరిహారం చెల్లించవలసిన అవసరం లేదు

قَالَ اللهُ تَعَالَى: ﴿لَا يُؤَاخِذُكُمُ اللَّهُ بِاللَّغْوِ فِيٓ أَيْمَٰنِكُمْ وَلَٰكِن يُؤَاخِذُكُم بِمَا عَقَّدتُّمُ الْأَيْمَٰنَ فَكَفَّٰرَتُهُۥٓ إِطْعَامُ عَشَرَةِ مَسَٰكِينَ مِنْ أَوْسَطِ مَا تُطْعِمُونَ أَهْلِيكُمْ أَوْ كِسْوَتُهُمْ أَوْ تَحْرِيرُ رَقَبَةٍ فَمَن لَّمْ يَجِدْ فَصِيَامُ ثَلَٰثَةِ أَيَّامٍ ذَٰلِكَ كَفَّٰرَةُ أَيْمَٰنِكُمْ إِذَا حَلَفْتُمْ وَاحْفَظُوٓا أَيْمَٰنَكُمْ﴾ [المائدة: ٨٩].

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కానీ మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నిస్తాడు. (అటువంటి ప్రమాణభంగానికి) పరిహారం ఏమిటంటే మీరు మీ ఆలుబిడ్డలకు తినిపించే మామూలు భోజనం పదిమంది పేదలకు పెట్టటం లేదా వారికి కట్టుబట్టలు ఇవ్వటం లేదా ఒక బానిసను స్వతంత్రునిగా చెయ్యటం. ఈ స్తోమత లేనివారు మూడు రోజులపాటు ఉపవాసం ఉండాలి. మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే మీ ప్రమాణాలకు పరిహారం ఇది. మీరు మీ ప్రమాణాలను కాపాడుకోండి." *(అల్‌మాయిద: 89)*

### ముఖ్యాంశాలు

ఒక విషయం ఆ విధంగా జరగకపోయినప్పటికీ దాని గురించి తనకు తెలిసినది

చెబుతూ దాని మీద ప్రమాణం చేయటం లేదా ప్రమాణం చేసే ఉద్దేశ్యం లేకపోయినా అలవాటు ప్రకారం నోటి నుండి దైవంసాక్షి! అనే పదాలు వెలువడటాన్ని పొరపాటు వల్ల జరిగే ప్రమాణాలుగా భావించవచ్చు. ఈ ప్రమాణాలు అబద్ధాలుగా తేలినా వాటికి పరిహారం చెల్లించవలసిన అవసరం లేదు. పరలోకంలో కూడా వీటి గురించి ప్రశ్నించటం జరగదు. ప్రమాణాలను కాపాడుకోవటమంటే ప్రతి చిన్న విషయానికీ ప్రమాణం చేయకుండా ఉండటం, చేసిన ప్రమాణాలను పూర్తి చేయటం అని భావం.

١٧٢١ ـ وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: أُنزِلَتْ هٰذِهِ الآيَةُ: ﴿لَا يُؤَاخِذُكُمُ اللَّهُ بِاللَّغْوِ فِي أَيْمَانِكُمْ﴾ فِي قَوْلِ الرَّجُلِ: لا وَاللهِ! وَبَلى واللهِ! رواه البخاري.

1721. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: "మీరు చేసే అర్థంలేని ప్రమాణాల విషయంలో అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు" అనే దివ్యఖుర్ఆన్ సూక్తి (ప్రమాణ ఉద్దేశ్యం లేకుండా మాటి మాటికీ) "దైవంసాక్షి! ఎందుకు కాదు దైవం సాక్షి" అని అంటూ ఉండేవాని విషయంలో అవతరించింది. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని తఫ్సీర్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1) ఇంతకు ముందు అధ్యాయంలో, ఈ అధ్యాయంలో వచ్చిన సూక్తుల్ని గమనిస్తే మనకు మూడు రకాల ప్రమాణాలున్నట్లు తెలుస్తుంది. ఒకటి అబద్ధపు ప్రమాణం; దీని గురించి ఇంతకుముందు తెలుసుకున్నాం. రెండోది పొరపాటు వల్ల చేసే ప్రమాణం; దీనికి పాపంగాని, పరిహారంగాని లేదు. ఇకపోతే మూడోది యమీనె మున్అఖిదహ్. అంటే భవిష్యత్తులో ఏదో ఒక పని చేస్తాననో లేక చెయ్యను అనో మనస్ఫూర్తిగా ప్రమాణం చేయటం. ఈ ప్రమాణాన్ని భంగపరిస్తే పైన దివ్యఖుర్ఆన్ సూక్తిలో పేర్కొనబడినట్లు పరిహారం చెల్లించవలసి ఉంటుంది.

2) ప్రమాణ భంగానికి చెల్లించవలసిన పరిహారంలో పదిమంది నిరుపేదలకు మధ్యరకపు అన్నం తినిపించాలని ప్రస్తావించబడింది. కాని ఆ అన్నం పరిమాణం ఎంత ఉండాలి? అన్న విషయంలో మాత్రం ప్రామాణిక హదీసులు ఏవీ లేవు. కొందరు పండితులు ఉదయం మరియు రాత్రి భోజనమంత అని పేర్కొన్నారు. మరికొందరు- రమజాన్ నెలలో ఉపవాసం ఉండి భార్యతో సంభోగించేవాడు చెల్లించవలసిన పరిహారం ప్రస్తావన ఉన్న హదీసుని నిదర్శనంగా చేసుకొని ప్రమాణ భంగానికి కూడా ఒక్కో నిరుపేదకు ఒక 'ముద్'

ఆహారం ఇవ్వాలని నిర్ణయించారు. ఎందుకంటే ఆ హదీసులో దైవప్రవక్త (సల్లం) అరవైమంది నిరుపేదలకు పంచిపెట్టటం కోసం సదరు వ్యక్తికి పదిహేను 'సా'ల ఖర్జూరాలు ఇచ్చారు. ఒక 'సా' నాలుగు 'ముద్'లకు సమానమైన కొలమానం. ఈ విధంగా పదిమంది నిరుపేదలకు కూరతో నిమిత్తం లేకుండా పది ముద్‌ల (దాదాపు 6 1/4 కి.గ్రా.ల) ఆహారం ఇవ్వవలసి ఉంటుంది (ఇబ్నెకసీర్). అంటే ఆరు కిలోల పిండిగాని, బియ్యంగాని, ఖర్జూరపండ్లుగాని ఇవ్వాలి. ఒకవేళ చెలామణి ప్రకారం పదిమంది నిరుపేదలకు ఒకపూట మధ్యరకపు అన్నం తినిపించినా మా దృష్టిలో అది సరిపోతుంది. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.